మున్సిపాలిటీకి భారంగా కరెంట్ బిల్లు

- పంప్‌హౌస్ బకాయి రూ.58.19 కోట్లు
- పదిహేనేళ్లుగా చెల్లింపులు నిలుపుదల
- ప్రభుత్వం ఆదుకుంటేనే బకాయిల చెల్లింపు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి ప్రజలకు తాగు నీరందించే పానగల్ పంప్‌హౌస్ కరెంట్ బిల్లుల బకాయి మున్సిపాలిటీకి తలకు మించిన భారంగా మారుతోంది. పంప్‌హౌస్ కరెంట్ బిల్లులు చెల్లించలేక మున్సిపల్ అధికారులు సతమతం అవుతున్నారు. ప్రభుత్వాల నుంచి నిధులు అరకొరగా రావడం, మున్సిపాలిటీ నిధులు వాహనాల డీజిల్, వీధి దీపాల కరెంట్ బిల్లులు, వాహనాల మరమ్మతులు, తాగు నీటి పైప్‌లైన్, మోటార్ల మరమ్మతులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలకు సరిపోని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో లక్షల్లో వచ్చే పంప్‌హౌస్ కరెంట్ బిల్లులు చెల్లించలేకపోతున్నారు. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 48వార్డుల్లో 2లక్షలకు పైగా జనాభా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పానగల్ ఉదయ సముద్రం నుంచి మున్సిపాలిటీకి చెందిన పంప్‌హౌస్ ద్వారా తాగు నీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పంప్‌హౌస్‌లో ఉపయోగించే మోటార్ల కరెంట్ బిల్లులు నెల, నెలా చెల్లించాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీ వద్ద డబ్బులు లేకపోవడంతో పంప్‌హౌస్ కరెంట్ బిల్లులు చెల్లించకుండా నిలిపివేశారు. పదిహేను సంవత్సరాలకు


మున్సిపల్ కార్యాలయం

పైగానే పంప్‌హౌస్ బిల్లులు చెల్లించడంలేదు. దాంతో ప్రస్తుతం రూ. 58.19 కోట్ల వరకు కరెంట్ బిల్లుల బకాయి పేరుకుపోయాయి. దీనిలో వాటర్‌కు సంబంధించి రూ. 11.14 కోట్లు, క్లియర్ వాటర్‌కు సంబంధించి రూ. 34 కోట్లు, అమృత్ స్కీం రూ. 13.05 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఈ మొత్తం 58.19 కోట్లు చెల్లించడం మున్సిపాలిటీకి తలకు మించిన భారంగా మారింది. రోజు వారీ నిర్వహణ, కార్మికుల వేతనాలు, వీధి దీపాల కరెంట్ బిల్లులు చెల్లించడానికే మున్సిపాలిటీ యంత్రాంగం నానా తంటాలు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న వాటిని వెళ్లదీయడానికే కష్టంగా ఉన్న తరుణంలో పాత బకాయిలు చెల్లించాలంటే మున్సిపాలిటీకి సాధ్యం కావడం లేదు.

ప్రభుత్వం ఆదుకుంటేనే...

గతంలో చెత్త తరలించే వాహనాల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. మున్సిపాలిటీలో గ్రామ పంచాయతీల విలీనం తరువాత విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం వాహనాల సంఖ్య వంద దాటింది. వాటి డీజిల్ ఖర్చు ,డ్రైవర్ల వేతనాలు, పెరిగిన విస్తీర్ణం ప్రకారం అవసరాల నిమిత్తం తీసుకున్న కార్మికుల సంఖ్య కూడా పెరిగింది. అదే విధంగా కార్మికుల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్నటికి చెల్లించేది మాత్రం మున్సిపాలిటీ స్థానిక పన్నుల ద్వారానే. ఆలయాల పండుగలు, ఇతర ఖర్చులు పెరిగిపోయిన కారణంగా పాత బకాయిలు చెల్లించడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్న విధంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే మున్సిపాలిటీ నిర్వహణలో భారం తప్పనుంది. దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో కరెంట్ బిల్లులు, కార్మికుల వేతనాల సమస్య జఠిలంగా మారుతుంది. ఆస్తి పన్ను, నీటి పన్ను ద్వారా మాత్రమే కరెంట్ బిల్లులు, కార్మికుల వేతనాలు చెల్లింపులు చేయాలంటే మున్సిపాలిటీలకు సాధ్యమయ్యే అవకాశం లేదు. కార్మికుల వేతనాలు ప్రభుత్వం చెల్లిస్తే కరెంట్ బిల్లులు బకాయిలు లేకుండా చెల్లించే అవకాశం ఉంటుందని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలపై దృష్టి సారించి ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బకాయిల సమస్య లేకుండా చేయవచ్చు. గత ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని అమలు చేస్తే ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా ప్రభుత్వం నుంచి వేతనాలు వచ్చే అవకాశం లేకపోలేదు. కోడ్ ముగిశాక సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరే ఉన్న మున్సిపల్ శాఖను సమీక్షిస్తే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న శ్రీనివాసులు

మునుగోడు: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాలకూరి వెంకన్న గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఆ పార్టీ మండల నాయకుడు ముచ్చపోతుల శ్రీనివాసులు రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశాడు. శుక్రవారం మునుగోడు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెంకన్న ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి నగదు అందచేశాడు. ఆయన వెంట ఆ వివిధ సంఘాల నాయకులు యడవల్లి సురేష్, పెరమాండ్ల ప్రతాప్, బొడ్డు యాదయ్య, పెరమాండ్ల ప్రణయ్, రావిరాల కుమారస్వామి, నీరుడు సైదులు, నర్సింహ ఉన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ, సీఐ

నకిరేకల్ : రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏడీఏ రామారావు నాయక్ డీలర్లను ఆదేశించారు. స్థానిక సీఐ రాజశేఖర్‌తో కలిసి శుక్రవారం పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాల అమ్మకాలకు సంబంధించి తప్పనిసరిగా రికార్డుల్లో రాయాలన్నారు. బిల్లులు కట్ చేసి రైతులకు ఇవ్వాలని సూచించారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీ విత్తనాలు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట ఆయా మండాలల ఏఈలు జానిమియా, పురుషోత్తం, శివ కుమార్, గిరి ప్రసాద్, పోలీసులు రమేష్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు మృతి

శాలిగౌరారం: మండలంలోని తిరుమల రాయునిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వడ్లకొండ శంకర్(50) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. శంకర్ మృతదేహంపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటింబీకులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ మరణం కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటన్నారు. శంకర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. వారివెంట కర్నాటి కృష్ణ, కడారి అంజయ్య, బంటు బీరప్ప, పెంబెల్ల శ్రీను, జమ్ము సతీష్, పడాల రమేశ్, బొమ్మగాని రవి, పెరుమాండ్ల నరేశ్; బోడ విజయ్‌కుమార్, దానయ్య, గరిగంటి శంకర్ ఉన్నారు.

2వ తేదీ వరకు హనుమాన్ జయంతి ఉత్సవాలు

రామగిరి(నల్లగొండ): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నల్లగొండ పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో జూన్ 2వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈఓ కె.కుశలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ హాజరై హనుమాన్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉత్సవాలు ప్రారంభం

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో కంఠ మహేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గణపతి పూజ, జల ధారణ కార్యక్రమంతో పాటు యజ్ఞం నిర్వహించారు. శనివారం బోనాలు, రాత్రి కంఠ మహేశ్వర స్వామి సురమాంబ కల్యాణం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కనగల్ : మండలంలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన పాలకూరి నాగమణి (36) బుధవారం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నాగమణిని వెంటనే నల్లగొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్.ఐ రామకృష్ణ తెలిపారు.

ఉపాధి సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

వేములపల్లి: ఉపాధి హామీ సిబ్బందిని ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వేములపల్లి మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో పిలుట్ల సైదులు, బొడ్డుమాల సైదులు, సుకన్య, మారయ్య, భిక్షం పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

నల్లగొండ క్రైం: స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న సురేందర్‌రెడ్డి , అర్మడ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బద్యానాయక్‌లు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చందనా దీప్తి సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బి డీఎస్పీ రమేష్, ఏఓ శ్రీనివాస్, సబిత, సీఐ రాఘవరావు, ఆర్ఐలు సూరప్ప నాయుడు, సంతోష్, జయరాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో వందేళ్ల చరిత్ర గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూల విరాట్‌కు నిత్యాభిషేకం,అలంకరణ, సాయంత్రం 4 గంటలకు శివాలయంలో నాగర్ కర్నూల్ వాస్తవ్యులు శ్రీ పద్మాలయ ఆచార్య వారిచే శ్రీ సీతా కల్యాణం హరి కథ నిర్వహించారు. జూన్ 1న శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉత్సవ మూర్తులకు సాముహిక అభిషేకాలు, స్వామి వారి కల్యాణ మహోత్సవాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు గజ్జల సూర్యప్రకాష్, చైర్మన్ కోటగిరి శ్రీనివాస్ తెలిపారు.

గురుకుల పాఠశాలకు పుస్తకాలు బహూకరణ

నకిరేకల్ : నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలకు సిలివేరు సాహిత సేవా కళా పీఠం ప్రతినిధులు నారయణదాస్ రఘువీర్ ఆధ్వర్యంలో శుక్రవారం 100 రకాల పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సునితతో పాటు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో చరిత్రకారుడు డి.సూర్యకుమార్,సాహిత వేదిక అధ్యక్షుడు లింగమూర్తి, ఉపాధ్యాయులు సంతోష, రోజా, సైదులు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

నల్లగొండ టూటౌన్ : యాదాద్రి భువనగిరిలో గత నెల 24 నుంచి మే 30 వరకు తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ లైసెన్స్ కోచ్ సర్టిఫికెట్స్ కోర్సు పూర్తి చేసుకున్న క్రీడాకారులు మద్ది కరుణాకర్, బాణావత్ మౌనిక, చిట్టిమల్ల సంధ్యను శుక్రవారం ఫుట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు అభినందించారు. జిల్లాలో ఫుట్ బాల్ క్రీడాకారులను తయారు చేయడానికి వీరు ఎంతగానో ఉపయోగపడుతారని తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

నకిరేకల్ : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో ఉన్న శ్రీ సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సేవా సమితి ప్రతినిధి గర్రె శ్రీనివాస్ తెలిపారు. కాళ్లలో సిరల వాపువ్యాధి ,కీళ్ల నొప్పికి దీర్ఘకాలిక ఉపశమనం, మోకాళ్ల నొప్పులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తేరట్‌పల్లిలో ఘనంగా మేడే

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. పార్టీ కార్యవర్గ సభ్యుడు బండ శ్రీశైలం జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొట్ట శివకుమార్, అచ్చిన శ్రీనివాసులు, వల్లూరి శ్రీశైలం ,పబ్బు మారయ్య, బండారి కిష్టయ్య, అచ్చిన బీరప్ప,కట్ట యాదగిరి, గిరి భిక్షం పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు లచ్చిరాం

చండూరు (గట్టుప్పల్) : మండలంలోని తేరట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల శ్రీ త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు తెలంగాణ కొంకటి లక్ష్మీనారాయణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్పీ భారతి, హీరో డైరెక్టర్ శివ కంఠమనేని, కళానిలయం సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుష్పలత సురేందర్ల చేతుల మీదుగా ఉపాధ్యాయుడు లచ్చిరాం అవార్డు అందుకున్నారు.

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే


తిరగండ్లపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మర్రిగూడ: కార్మిక, కర్షక, రైతు, నిరుద్యోగ, యువత, పేదల కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీనేనని మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తిరగండ్లపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. 8గంటల పని విధానాన్ని రద్దు చేసి 12గంటల పని విధానం తీసుకురావడమంటే కార్మికుల శ్రమను దోపిడీకి గురి చేయడమేనన్నారు. ఉపాధిహామీ కూలీలకు రోజు వారీ కూలీ రూ.600 చెల్లించాలని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులకై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, మైల సత్తయ్య, కాగు వెంకటయ్య ఉన్నారు.

వృద్ధురాలికి గొలుసు అప్పగింత


వృద్ధురాలికి గొలుసు ఇప్పిస్తున్న అధికారులు

నల్లగొండ: కుటుంబ సభ్యులు వృద్ధురాలి వద్ద తీసుకున్న గొలుసును శుక్రవారం అధికారులు తిరిగి ఆమెకు అప్పగించారు. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ మేదర బజార్‌కు చెందిన సుకారం లక్ష్మమ్మ (95) తన మెడలో ఉన్న 10 తులాల బంగారు గొలుసును కుటుంబ సభ్యులు తీసుకుని వేధిస్తున్నారని శుక్రవారం కలెక్టర్ హరిచందనను కలిసి విన్నవించింది. కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో శిశు సంక్షేమ, వయో వృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, నల్లగొండ సీడీపీఓ నిర్మల ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశోధన నిర్వహించారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, కాలనీ వాసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆ వృద్ధురాలి గొలుసును తిరిగి ఆమెకు ఇప్పించారు.

ఆర్ఎంపీలను ఇబ్బందులకు గురిచేయొద్దు

చండూరు : ఆర్ఎంపీ, పీఎంపీలను ఇబ్బందులకు గురి చేయవద్దని సీపీఐ కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్ తెలంగాణ వైద్య బృందం సభ్యులను కోరారు. శుక్రవారం ఆయన చండూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం జిల్లావ్యాప్తంగా మారు మూల గ్రామాల్లో రోగులకు సేవలందిస్తున్న ఆర్ఎంపీ పీఎంపీలపై దాడులు చేయడం సరికాదన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ బాలకృష్ణ

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన 10వ తరగతి మిత్రుడు మందుల రాములు భార్య జ్యోతి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బాలకృష్ణ 10వ తగరతి మిత్రుల సహకారంతో రూ.41 వేలను రాములుకు అందించారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు ఆత్మరక్షణకు చిన్ననాటి నుంచే కరాటే నేర్చుకోవాలని, అత్యవసర సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను కూడా రక్షించవచ్చని షావోలిన్‌షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు అన్నారు. నల్లగొండ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించిన వేసవి కరాటే శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. 37 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించి కరాటేలోని మెలకువలను నేర్పిండం జరిగిందన్నారు. తమ పిల్లలు కరాటే నేర్చుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు వివిధ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న నాంపల్లి కనకారావు

ఉద్యోగ విరమణ సన్మాన సభ

నల్లగొండ: గిరిజన సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం 4వ తరగతి ఉద్యోగులు హనుమంతు, అరిగెల సైదులు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ్‌కుమార్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జాఫర్, డీవీనాయక్, అతీక్ అహ్మద్, మణి, ముంతాజ్, పాండు, శంకర్, నవీన్ పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కనగల్: రైతులకు సబ్సిడీపై అందించే జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 30 కేజీ బస్తా రూ.1116 (150) బ్యాగులు కనగల్ సొసైటీ, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు తెలి పారు. కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌తో కనగల్ రైతు వేదిక వద్దకు రావాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన హ్యాండ్ బాల్ శిక్షణ


నకిరేకల్ : శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

నకిరేకల్ : నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో నెల రోజులు గా నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవాం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ర వీరారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రస్తుతం హ్యాండ్ బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు హ్యాండ్ బాల్ క్రీడలో రాణించాలన్నారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, ఉపాధ్యాయులు లగిశెట్టి సత్యనారయణ, నాగేందర్, లింగస్వామి,సైదులు, ప్రకాష్, అజయ్ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

నార్కట్‌పల్లి : ఉపాధి హామీ పథకం కింద నార్కట్‌పల్లి మండలంలో చేపడుతున్న వివిధ పనులపై జూన్ 1(శనివారం)న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు నార్కట్‌పల్లి ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పని సరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఇరు వర్గాల ఘర్షణలో ఏడుగురిపై కేసు నమోదు

చిట్యాల : గ్రామంలో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఏడుగురిపై కేసు నమోదైంది. ఎస్ఐ సైదాబాబు శుక్రవారం తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన రుద్రారపు మహేష్, ప్రవీణ్‌తో పాటు మరికొందరు కలిసి గురువారం ఓ యువకుడితో ఘర్షణ పడుతుండగా అదే గ్రామానికి చెందిన బొమ్మగాని పరమేష్ అడ్డుకుని విడిపించాడు. అనంతరం అదేరోజు రాత్రి రుద్రారపు మహేష్, ప్రవీణ్‌లతో పాటు మరికొందరు కలిసి పరమేష్ ఇంటిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న పరమేష్‌తో పాటు అతడి తండ్రి నర్సింహాతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఫిర్యాదులపై దర్యాప్తు జరిపిన పోలీసులు బొమ్మగాని నర్సింహ ఇంటిపై కర్రలతో దాడి చేసిన రుద్రారపు ప్రవీణ్, మహేష్, రుద్రారపు బన్ని, రుద్రారపు సాయి, వీరమల్ల చరణ్, వీరమల్ల జగదీష్, రుద్రారపు భిక్షంపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు



కనగల్ : కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండల పరిధిలోని దోరెపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. దోరెపల్లి గ్రామానికి చెందిన యువకులు కారులో శుభకార్యానికి వెళ్లొస్తున్నారు. తిరిగి ఇంటికి చేరుకుంటున్న క్రమంలో గ్రామ శివారులో కారు టైరు పగిలి అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు.



విదేశాల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నల్లగొండ రూరల్: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలను శుక్రవారం రాత్రి విదేశాల్లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించా రు. లండన్, యూఎస్ఏ, ఆస్ట్రేలియాలో ఉన్న ఆయన అభిమానులు కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. లండన్‌లో వేముల సుధీర్, యూఎస్‌లో వివేక్, ఆస్ట్రేలియాలో భగత్‌ల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.


నకిరేకల్ : ఆస్ట్రేలియాలో కేక్ కట్ చేస్తున్న నకిరేకల్ వాసులు

ఆస్ట్రేలియాలో..

నకిరేకల్ : ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ సిటీలో శుక్రవారం రాత్రి 12గంటల తరువాత నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలను అక్కడ ఉంటున్న నకిరేకల్ వాసులు వేముల వీరేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే అభిమానులు గాదగోని భగత్, ప్రమోద్ రెడ్డి ,వెంకటేష్,ఆడపాల నాగప్రసాద్, శ్రవణ్, కల్యాణ్, సాయిరాం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు

నార్కట్‌పల్లి : మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యే లు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశంను శుక్రవారం హైదరాబాద్‌లో నార్కట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వివేకానందరెడ్డి కలిశారు. శనివారం వారి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మిర్యాలగూడ అర్బన్: బీసీ రిజర్వేషన్ల అమలు తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీసీ కులాలపై ప్రేమ చూపించి ఎన్నికల తరువాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు లేకపోవడంతోనే బీసీ కులాలు వెనుకబాటుకు గురయ్యాయన్నారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 11న నల్లగొండలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వస్కుల సైదమ్మ కాశి పాల్గొన్నారు

